# ఆచార్య దేవోభవ

ఉదయం ఆరు గంటల సమయం. అప్పుడప్పుడే వెలుగు రేకులు విచ్చుకుంటున్నాయి.

కిష్టయ్య పంతులు వీధి వాకిట్లో ఉన్న పడక్కుర్చీలో కూర్చుని భార్య ఇచ్చే కాఫీ కోసం ఎదురు చూస్తున్నాడు.

ఆయన పూర్తి పేరు రామకృష్ణయ్య. కానీ, పాతికేళ్ళ క్రితం స్కూల్లో టీచరుగా ఉద్యోగం వచ్చినప్పటి నుంచి ఆయన అందరికీ 'కిష్టయ్య పంతులు'' అయిపోయాడు. అసలు పేరు మరుగున పడిపోయింది.

రోజూ అయిదు గంటకే లేవడం ఆయనకు అలవాటు. తన కాలకృత్యాలు తీర్చుకుని-వరండాలోని పడక్కుర్చీలో కూర్చుంటాడు. ఆరు గంటలవుతుండగా భార్య కాఫీ ఇస్తుంది. పొగలు కక్కే ఆ కాఫీని ఊదుకుంటూ అరగంట సేపు తాగుతాడు.

ఈ తరువాత పుస్తకాలు పట్టుకుని నెమ్మదిగా అడుగులు వేస్తూ స్కూలుకు బయలు దేరుతాడు. ఏడు గంటలకు స్కూలు. రెండో గంట కొడ్తుండగా స్కూల్లోకి అడుగు పెడతాడు. ఆయన టీచరు ఉద్యోగంలో చేరినప్పటి నుంచీ అలవాటైన కార్యక్రమం అది.

కానీ ఈ రోజు ఆ దినచర్యకు విరుద్ధంగా ఆరు గంటలు దాటుతున్నా కాఫీగ్లాసు పట్టుకుని భార్య రాలేదు.

ఆయనలో అసహనం చోటు చేసుకుంది. టైముకు కాఫీ గొంతులో పడలేదనే బాధతో పాటు స్కూలుకు 'ఆలస్యమైపోతుందనే.....'' ఆందోళన కూడా తోడయింది.

"జానకీ! కాఫీ అయిందో లేదో మీ అమ్మను అడగవే '' అంటూ కూతురిని పిలిచాడు.

దానికి సమాధానంగా భార్య లోపలినుంచి వచ్చి "పాలు రాలేదు" అంది!

ఆయనకు మరింత ఆశ్చర్యం కలిగింది.

తమకు పాలు పోసే రంగమ్మ గత అయిదేళ్ళ నుంచీ ఒక్క రోజు కూడా

మానకుండా పోస్తోంది. వర్షంలో-వణికించే చలిలో కూడా మానలేదు. ఇంట్లో-ఒంట్లో బాగాలేకపోతే ఎవరితోనైనా పంపేది.

"పంతులు గారూ. ఇంకెవరికైనా పాలోయడం మానేత్తగానీ - మీకు మాననయ్యా" అని చెప్పేది.

అలాగే ఇన్నాళ్ళూ పోసింది. ఇవ్వాళ ఏమైందో.

ఆయన ఆలోచనల్లో ఉండగానే భార్య గిన్నె పట్టుకొచ్చి-" త్వరగా రంగమ్మ దగ్గరకు వెళ్ళి పాలు పోయించుకురండి. పిల్లలు ఏడ్చి.... గోల చేస్తున్నారు." అంది ..

"నేనా ?"

"అవును, మీరే. త్వరగా వెళ్ళండి." ఆవిడ ఊదరగొట్టేసింది.

ఇక ఆయనకు వెళ్ళక తప్పలేదు.

"ఏదీ ఆ గిన్నె?"

తన చేతిలోని సిల్వర్ గిన్నెను ఆయన ముందు పెట్టింది.

"ఇదెలాగే పట్టుకోవడం? ఏదైనా క్యారేజీ ఇవ్వు" అన్నాడు.

ఆ మాట వినగానే ఆవిడ ఇంతెత్తున లేచింది.

"నే నెన్నిసార్లు చెప్పానో ఒక్క క్యారేజీ కొనమని. నా మాట విన్నారా? ఇప్పుడు మీకే తెలుసొచ్చిందిదానవసరం. అంతేలెండి. ఏదైనా తన దాకా వస్తేగానీ మనుషులకు తెలీదు."

కిష్టయ్య పంతులు కిక్కురుమనకుండా పట్టుకుని బయలు దేరాడు.

గుమ్మందాటి నాలుగడుగులు వేశాడో లేదో తోటి మాస్టారు జానకిరామయ్య ఎదురొచ్చాడు హడావుడిగా ... ఆయన్ని చూసి కిష్టయ్యపంతులు చేతిలోని గిన్నెను కండువా చాటున దాచాడు.

"మాస్టారూ. స్కూలుకేనా." జానకిరామయ్య అడిగాడు.

"ఆ ... ఆ ...." ఏదో చెప్పబోయాడు కిష్టయ్య పంతులు.

కానీ ఆయన మాట పూర్తి కాకుండానే జానకిరామయ్య అందుకుని-"మాస్టారూ' నే నివ్వాళ స్కూలుకి రావడం లేదు. అర్జంటు పనొకటి తగిలింది. మీ రీ సెలవు చీటీ స్కూల్లో హెడ్‌మాస్టారుకు ఇచ్చెయ్యండి" అంటూ కాగితాన్ని ఆయన చేతిలో కుక్కి వచ్చినంత వేగంగానూ వెళ్ళిపోయాడు.

కిష్టయ్య పంతులు ఆ కాగితాన్ని జేబులో పెట్టుకుని-ముందుకు నడిచాడు.

రోడ్లు అధ్వాన్నంగా ఉన్నాయి. గ్రామాల్ని బాగు చేస్తాం, రోడ్లేస్తాం, కరెంటు పెట్టిస్తాం... అంటూ చందాలు వసూలు చేశారు. వాళ్ళేసిన రోడ్డు .... నాలుగు రోజుల

క్రితం కురిసిన వర్షానికి కొట్టుకుపోయి గుంటలు మాత్రం మిగిలాయి. నడక తొందరలో గుంటల్లో పడబోయి నిలదొక్కుకున్నాడు.

ఇన్నేళ్ళలో ఏనాడూ ఇలా పాలకోసం కానీ, మజ్జిగ కోసం కానీ, కూరగాయల కోసం కానీ బయటకు వెళ్ళలేదు.

తను స్కూల్లో టీచరుగా చేరిన కొత్తల్లో స్కూల్లోని కుర్రాళ్ళు ప్రతిరోజూ కూరగాయలతో సహా అన్నీ తెచ్చి ఇంట్లో పడేసేవారు.

వాటిని చూసి తను ఆశ్చర్యపోతూ- "ఎందుకర్రా ఇవన్నీ? వద్దు... వద్దు.... మీ ఇంటికి తీసుకుపొండి....." అన్నాడు.

కానీ వాళ్ళు వినలేదు.

"మాస్టారూ ఇవి మీరు తీసుకోవలిసిందే. లేకపోతే మే మసలు ఇళ్ళకు వెళ్ళం" అన్నారు.

"మాస్టారు మేం రోజూ తీసుకొస్తాం" అని చెప్పి వెళ్ళేరు."

వాళ్ళ ఆప్యాయతకు అబ్బురపడ్డాడు.

ఆ సాయంత్రం వాళ్ళ తండ్రులు కనబడి - "ఏం మాస్టారూ. మా కుర్రాళ్ళు కూరగాయలు తెచ్చిస్తే వొద్దన్నారంటగా ? మే మేవన్నా కొన్నామా ? మా చేలో కాసినవే. పిల్లోడికి నాలుగచ్చరం ముక్కలు సెప్పే మేష్టారివి. నీకు కాకపోతే ఎవరి కిస్తాం?" అన్నారు.

ఆ మాటలు వినగానే తనకు ఆనందం చెప్పనలవి కాదు. అప్పటివరకూ- బ్రతుక లేక బడిపంతులు ఉద్యోగంలో చేరానని, దీనికంటే ఏ ఆఫీసులో గుమాస్తాగా చేరినా ఎంతో బాగుండేదని బాధపడ్డాడు. కానీ బడిపంతులుకు ఇంతటి గౌరవమర్యాదలు కలుగుతాయని కలలో కూడా అనుకోలేదు. ఆ రోజు మొదటిసారిగా గర్వపడ్డాడు!

అప్పటి నుంచి ఇంట్లో వస్తువుల కోసం తను పైసా కూడా ఖర్చు పెట్టనవసరం లేకపోయింది. రోజులు చాలా హాయిగా గడిచిపోయేవి.

కానీ రాను రాను ప్రజల్లో మార్పు వచ్చింది. తన గ్రామం కూడా కొంత నాగరికతను సంతరించుకుంది. కరెంటు వచ్చింది. బస్సులు వచ్చాయి. పట్టణాలకు రాకపోకలెక్కువయ్యాయి. ఆ ప్రభావంతో గ్రామ ప్రజల్లో కూడా డబ్బు మీద ఆశ - స్వార్థం ఎక్కువయ్యాయి. పాల సొసైటీ వచ్చింది. ఇళ్ళకే వచ్చి పాలు పోయించుకు వెడుతున్నారు కేంద్రం వాళ్ళు.

కూరగాయలు పట్నం తీసుకెళ్ళి, అమ్ముతున్నారు. దానితో తనలాటి వాళ్ళకు ఇబ్బంది కలిగింది. అన్నీ కొనుక్కోవాల్సినదుస్థితి ఏర్పడింది.

అయినా ఎన్నడూ ఇలా వీధిన పడలేదు. ఇక ముందు ముందు రోజులు ఇలా కూడా మారబోతున్నాయేమో.

"ఏవయ్యా... పంతులూ !

ఎవరో పిలిచినట్లయితే కిష్టయ్య పంతులు ఆలోచనల నుంచి బయటపడి తలెత్తి చూశాడు.

ఎదురుగా ఊరి ప్రెసిడెంటు.

కిష్టయ్య పంతులు ఆయన్ని చూసి కంగారు పడ్డాడు. రెండు చేతుల్తో ఆయనకు నమస్కారం చేద్దా మనుకున్నాడు కానీ చేతిలో గిన్నె ఉండడంతో కుదరలేదు.

"నమస్కారం బాబూ" అన్నాడు నోటితోనే.

"ఆ .... అది సరేగానీ ... మా పిల్లోడినీ మద్దెన బాగా కొడుతున్నావంటగా ?" అంటూ నిలేశాడు.

ఆ ఆరోపణకు బిత్తరపోతూ- "అ... అవును బాబూ చదువులో కొద్దిగా వెనకబడుతున్నాడు కాస్త భయపడితే... చదువుతాడని....." అన్నాడు.

ఆ మాట వినగానే ప్రెసిడెంటు మరింత మండిపడ్డాడు.

"కొడితే చదువొచ్చుద్దా? ఇదుగో పంతులూ మరోసారి మా వాడి వొంటిమీద సెయ్యి ఏశావంటే మర్యాదగా వుండదు.. గుర్తుంచుకో..." అని వెళ్లిపోయాడు.

కిష్టయ్య పంతులు నిర్ఘాంతపోయాడు. ఎంత మాట అన్నాడు ప్రెసిడెంటు. అయినా పిల్లల్ని కొట్టడం తనకేవన్నా సరదానా? తనూ పిల్లలు గలవాడే. పిల్లల్ని ద్వేషంతో ఏనాడూ దండించలేదు.

చదువుకోవాలని-క్రమశిక్షణతో పెరగాలనే ఉద్దేశంతో... అప్పుడప్పుడు భయపెట్టేవాడు. పిల్లలకు గురువుల పట్ల భయం ఉంటేగానీ చదవరు...

ప్రెసిడెంటు 'కుర్రాడు చదవకపోయినా ఫరవాలేదు కానీ... కొట్టడానికి వీల్లేదు- అనే ధోరణిలో మాట్లాడుతున్నాడు.

ఇది వరకు తండ్రుల స్వభావం ఇలా ఉండేది కాదు.

"పంతులూ! మా కుర్రోడు బాగా సదవాల. వాడిని బాగా కొట్టయినా సరే... నాలుగచ్చరం ముక్కలు నేర్పించు... అయినా కొడితే గానీ పిల్లోళ్ళు సదవరయ్యా" అనే వారు. ప్చ్. కానీ ఇప్పుడంతా మారిపోయింది. అనుకుంటూ ముందుకు నడిచాడు...

"అదుగోరోయ్ మాస్టారు. ఎక్కడికో పోతున్నాడు...

"అవున్రోయ్... మన మాస్టారే. వాడు స్కూలుకు రావడం లేదుగా? ఇక మనం కూడా పోనక్కర్లేదు... " కుర్రాళ్ళు మాట్లాడుకుంటున్నారు.

ఆ మాటలకు కిష్టయ్య పంతులుమనస్సు చివుక్కుమంది. తల తిప్పి చూశాడు.

ఎవరో కుర్రాళ్ళు ఆయని చూసి వెక్కిరిస్తూ నవ్వుకుంటూ పారిపోతూన్నారు.

అటువంటి మాటలు వెక్కిరింతలు ఈ మధ్య బాగా అలవాటవుతున్నా విన్నప్పుడల్లా ఆయన మనస్సు బాధ పడుతూనే ఉంది.

పట్టణ రాజకీయాలు తమ ఊళ్ళో ఏనాడు ప్రవేశించాయో అప్పటి నుంచి విద్యాసంస్థలు కూడా పాడయిపోయాయి. పిల్లలకు చదువులు చెప్పే గురువులంటే భయం బొత్తిగా పోయింది. తండ్రుల అధికారదర్పం-అహంకారం పిల్లల్లో కూడా చోటు చేసుకుని ఎవ్వరినీ లక్ష్య పెట్టడం మానేశారు.

తను పాఠం చెప్తొంటే ఒక రోజు ఒక కుర్రాడు వెనక బెంచీలో కూర్చుని రాకెట్లు చేస్తూ బయటకు విసిరేస్తున్నాడు. అది గమనించి ... తను వాడి చెంపమీద నాలుగు దెబ్బలు వేశాడు. మర్నాడు మరో నలుగురు కుర్రాళ్ళను వెంట బెట్టుకొచ్చి తనతో పెద్ద పోట్లాట పెట్టుకున్నాడు.

"మాస్టారూ! మరోసారి ఇలా మావాడిని కొట్టారంటే ఊరుకోం. జాగ్రత్త" అని బెదిరించి వెళ్ళారు.

ఆ తరువాత ... ఆ విషయం హెడ్ మాస్టారుకి చెప్పాడు.

ఆయనకి ఇటువంటి గొడవలంటే చాలా భయం. అల్లరి కుర్రాళ్ళకు దూరంగా ఉంటాడు.

"మీ కెందుకు మాస్టారూ. ఆ కుర్రాళ్ళతో? వాళ్ళ గురించి పట్టించుకోకండి" అన్నాడు.

"అది కాదు సార్ వాళ్ళు చేసే అల్లరి చూశారా?" ఇంకా ఏదో చెప్పబోయాడు.

ఆయన మధ్యలోనే అడ్డుకుని "ఆ... కుర్రాళ్ళు అల్లరి చెయ్యక మీరూ-నేనూ చేస్తామా? చూసీ చూడనట్లు ఊరుకోండి" అని సలహా చెప్పాడు.

ఇక తనేం మాట్లాడలేకపోయాడు. తోటి మాస్టార్లు కూడా తనకే హితబోధ చేశారు.

"మాస్టారూ ఈ కాలం కుర్రాళ్ళలో భయం, భక్తీ బొత్తిగా లేదు. చదువుమీద ఆసక్తీ తగ్గిపోయింది. వాళ్ళు వింటానంటే నాలుగు ముక్కలు చెప్పండి. లేకపోతే ఊరుకోండి. మేం అలాగే చేస్తున్నాం" అన్నారు.

వాళ్ళ మాటలు తన కెంతో ఆశ్చర్యాన్ని కలిగించాయి. పిల్లలు అల్లరి చేస్తే వాళ్ళని దండించి అదుపులో పెట్టాల్సిన ఉపాధ్యాయులు పిల్లలకే భయపడితే ఎలా? ఇక ఇటువంటి స్థితిలో క్లాసులకేం వెళ్ళగలరు? పిల్లలకు పాఠాలేం చెప్పగలరు ?

మిగిలిన మాస్టార్లు-క్లాసులు ఎగ్గొట్టేయడం ... ఒకవేళ వెళ్ళినా అటెండెన్సు తీసుకుని... "ఎవరికేనా ఏవన్నా పనులుంటే... వెళ్ళిపోవచ్చోయ్ అని పిల్లల్ని పంపేయడం చేస్తుంటారు. కాని తన కటువంటివి నచ్చవు. అటు వంటి మాస్టర్లు ఉపాధ్యాయ వృత్తికే తీరని కళంకం తెస్తున్నారని తన అభిప్రాయం. గంట కొట్టగానే కచ్చితంగా క్లాసుకు వెళ్ళడం, కుర్రాళ్ళని తిట్టయినా సరే కూర్చోబెట్టి పాఠాలు చెప్పటం తన కలవాటు. ఎన్ని

అవమానాలు-సమస్యలు ఎదురైనా తన పద్ధతిని మార్చుకోలేదు. ఇక ముందు కూడా మార్చుకోడు అనుకున్నాడు మనసులో కిష్టయ్య పంతులు.

ఇంతలో స్కూలు ఫస్టు బెల్లు వినిపించింది. అది విని కిష్టయ్య పంతులు చకచకా అడుగులు వేశాడు.

మరో పది నిముషాల్లో రంగమ్మ ఇంటి ముందు నిలబడి- "రంగమ్మా, రంగమ్మా" అంటూ పిలిచాడు.

అయిదు నిముషాల అనంతరం రంగమ్మ బయటికి వచ్చింది. కిష్టయ్య పంతుల్ని చూసి-"ఏంటి పంతులూ?" అంది ఎంతో నిర్లక్ష్యంగా.

ఆ ఏకవచన సంబోధన విని ఆశ్చర్యపోయాడు... అయినా ... అవసరం తనది కాబట్టి... తమాయించుకుని-"రంగమ్మా, ఈ రోజు పాలు తేలేదే? అని అడిగాడు.

"ఇక తేవడం కుదరదయ్యా" అంది కొట్టినట్లు.

పంతులు గతుక్కుమన్నాడు. "ఏం?"

"నిన్న మా కుర్రోడిని గంట సేపు ఎండలో నిలబెట్టావంటగా" అంటూ నిలదీసింది. అనుకోని ...ఈ నిందారోపణకు బిత్తరపోతూ- "నేనా... లేదే" అన్నాడు.

అదివిని రంగమ్మ "ఎందుకయ్యా... అబద్ధం? ఉండు. కుర్రోడిని పిలిచి తేలుత్తా" అంటూ కొడుకుని పిలిచింది.

పన్నెండేళ్ళ- ఆమె చిన్నకొడుకు లోపలి నుండి వచ్చాడు.

"ఏరా. నిన్ను పంతులు నిలబెట్టాడా? లేదా? అనడిగింది.

"ఆ... ఈయనే నమ్మా. నన్ను చాలాసేపు నిలబెట్టింది. నా కాళ్ళు ఎంతో నొప్పులెట్టాయి" అన్నాడు.

"అది కాదు రంగమ్మా. నీకొడుకు మరొకడి పెన్సిల్ తీసుకుని దాచేశాడు. అది తప్పుకదా. అందుకు నిలబెట్టాను. క్లాసు బయటి వరండాలో నిలబడ్డాడు. కానీ ఎండలో కాదు" అన్నాడు కిష్టయ్యపంతులు.

ఆ మాట వినగానే కోపంతో ఎగిరిపడుతూ-" ఏంటయ్యోయ్. ఆ మాటలు? అలాటి దొంగతనాలు, ఎదవబుద్ధులు మా వొంశంలో లేవు. నేను కుర్రోడిని అడిగా కూడా. వాడే తప్పూ చేయలేదన్నాడు. ఉత్తుపున్నేనికి నువ్వే నిలబెట్టావంట" అంది.

"రంగమ్మా పిల్లలు అలాగే చేస్తారు. వాళ్ళ మాటలు పట్టించుకోకూడదు."

"చాలు చాల్లేవయ్యా, మా వోడు ఎప్పుడూ అబద్ధాలు సెప్పి ఎరగడు. ఏదో నాలుగు ముక్కలు సెప్తున్నావని సంబరపడ్డాను కానీ ఇలా వాడిని కట్టబెడుతున్నావని తెలీదు. ఇదుగో పంతులూ... నీకు నా సంగతి తెలీదయ్యోయ్. ఇంకోసారి ఇలాసేశావంటే

నిన్నీ ఊళ్ళో ఉండకుండా సేస్తాను. తెలిసిందా?" అంటూ లోపలకు వెళ్ళిపోయింది.

కిష్టయ్య పంతులు బిక్కచచ్చిపోయాడు. ఆ అవమానం భరించలేక పోయాడు. రంగమ్మ ఎంత మాట అంది ?

రంగమ్మ కొడుకు నిజంగా దొంగవెధవే. అందరి దగ్గర్నుంచీ పెన్సిళ్ళు, పుస్తకాలు, రబ్బర్లు దొంగతనం చేస్తూంటాడు. వాడికి ఎన్నోసార్లు మెల్లగా చెప్పి చూశాడు. వాడు మారలేదు.

రంగమ్మకి కూడా వాడి విషయం చూచాయగాచెప్పి అదుపులో పెట్టమన్నాడు. కాని ఆమె పట్టించుకోలేదు.

ఇంట్లో తల్లి దండ్రులు-స్కూల్లో ఉపాధ్యాయుడు... పిల్లల్ని సరైన దారిలో పెట్టాల్సిన ఉపాధ్యాయుడిగా తనకున్న బాధ్యతని బట్టి వాడిని మంచి మార్గంలోకి మళ్ళించాలని ఆ శిక్ష వేశాడు. అది తప్పా? తను చేసిన పనికి రంగమ్మ సంతోషిస్తుందనుకున్నాడు. గానీ... ఇలా వాడి ముందే తనని అన్ని మాటలంటుందని ఎన్నడూ అనుకోలేదు.

ఎందుకిలా జరుగుతోంది. కాలంలో మార్పు వచ్చిందా? లేక మనుషుల్లో వచ్చిన మార్పా? ఏదయినా ఈ మార్పు తనలాటి ఉపాధ్యాయులు హర్షించరు. ఇటువంటి వాతావరణంలో తనలాటి వాళ్ళు బతకలేరు కూడా. ఏం చేయాలి.

ఆలోచనలతో తల దిమ్మెక్కి ోయిం దాయనకు. ఖాళీ గిన్నెతో తిరిగి ఇంటి వేపు నడకసాగించాడు.

"ఏం మాస్టారూ రెండో బెల్లు కూడా అయిపోయింది. ఇవ్వాళ బడికి పోలేదే?" ఎవరో పలకరించారు.

"ఆ... ఆ... వెడుతున్నా" అంటూ కిష్టయ్యపంతులు తడబడుతూ ముందుకు అడుగులు వేశాడు.

"ఏం మేట్టర్లో... ఏం సదువులో పంతుళ్ళే ఇలా ఉంటే... ఇక పిల్లలకి సదవే వొత్తాది?" విసుక్కుంటూ తన దారిన పోయా డతను.

ఆ మాటలు వినగానే కిష్టయ్యపంతులు మనస్సు మరింత బాధ పడింది.

అందరూ మాస్టర్లని నిందించే వాళ్ళే.

ప్రతివాడికీ లోకువ ఉపాధ్యాయుడే. చదువు చెప్పినా తప్పే, చెప్పకపోయినాతప్పే. పిల్లల్ని దండించినా తప్పే దండించకపోయినా తప్పే.

అందరూ చేసే అన్ని తప్పులకూ శిక్ష అనుభవించే వాళ్ళు తనలాటి పంతుళ్ళే- అనుకుంటూ భారంగా ముందుకు నడిచాడు కిష్టయ్య పంతులు!